# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 26-07-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

-  భారత్ తన రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసుకుంటూనే ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.

-  గత రెండేళ్ల ప్రభుత్వ పాలన గురించి ఇంటింటికీ వెళ్ళి వివరించాలని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆ పార్టీ నాయకులకు స్పష్టం చేశారు.

-  ఆక్వా రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ చెప్పారు.

-  వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన నిన్నటి అల్పపీడనం ఈరోజు వాయుగుండంగా మారిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

====================

రక్షణ ఉత్పత్తులు, ఎగుమతుల్లో భారత్ నేడు కొత్త శిఖరాలకు చేరుకుంటోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. అదే విధంగా ఒక విశ్వసనీయమైన ప్రపంచ రక్షణ భాగస్వామిగా కూడా ఎదుగుతోందని చెప్పారు. దేశం తన రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసుకుంటూనే ఉందన్నారు. 'మన్ కీ బాత్' కార్యక్రమం 136వ సంచికలో ఆయన ఈరోజు మాట్లాడుతూ.. డీఆర్‌డీఓ ఇటీవల పినాకా దీర్ఘశ్రేణి గైడెడ్ రాకెట్‌ను విజయవంతంగా పరీక్షించిందని గుర్తు చేశారు. కొన్ని రోజుల క్రితం ఐఎన్ఎస్ మహేంద్రగిరిని భారత నౌకాదళంలోకి ప్రవేశపెట్టారని హర్షం వ్యక్తం చేశారు. ఈ ఆధునిక యుద్ధనౌకను దేశంలోనే రూపకల్పన చేసి నిర్మించారని పేర్కొన్నారు. అలాగే.. నేడు యావత్ దేశం 'కార్గిల్ విజయ్ దివస్' జరుపుకుంటున్న సందర్భంగా కార్గిల్ యుద్ధంలో శత్రువులతో వీరోచితంగా పోరాడిన భారత సైనికులకు ప్రధానమంత్రి నివాళులు అర్పించారు. 1999లో పాకిస్థాన్‌తో జరిగిన సంఘర్షణలో కఠిన వాతావరణ పరిస్థితులు, శత్రువు నుంచి సవాళ్లు ఎదురైనప్పటికీ దేశ సైనికులు అసాధారణ ధైర్యాన్ని ప్రదర్శించారని నరేంద్రమోదీ కొనియాడుతూ...

(వాయిస్…30 సెకన్లు)

====================

గత రెండేళ్ల ప్రభుత్వ పాలన గురించి ఇంటింటికీ వెళ్ళి వివరించాలని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆ పార్టీ నాయకులకు స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ ముఖ్యనేతలతో ఈరోజు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అంశాలపై దిశానిర్దేశం చేశారు. 2 ఏళ్ల పాలనపై 45 రోజుల పాటు డోర్ టు డోర్ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలూ గెలిచేలా ఎన్డీఏ కూటమి పార్టీల అభ్యర్థుల గెలుపుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.

====================

ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాయని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ చెప్పారు. ఇటీవల ఢిల్లీలో కేంద్ర మంత్రులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి ఆక్వా రైతుల సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. ఇందుకు గానూ ఆక్వా రైతుల ప్రతినిధి బృందం శ్రీనివాస వర్మను ఈరోజు భీమవరంలో కలిసి కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఫీడ్ ధరలు అమాంతం పెరగడం వల్ల ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కసరత్తు చేస్తోందన్నారు. సోయాబీన్ ధరల పెరుగుదల, మన ప్రాంతం నుంచి ఫిష్ మీల్ భారీగా ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతుండటమే ఫీడ్ ధరలు అమాంతం పెరగడానికి ప్రధాన కారణమన్న అంశాలను కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. త్వరలోనే ఫీడ్ ధరల తగ్గింపు, ఎగుమతుల నియంత్రణపై కేంద్ర ప్రభుత్వం తగిన నిర్ణయాలు తీసుకుంటుందని శ్రీనివాస వర్మ ఆశాభావం వ్యక్తం చేశారు.

====================

విరామం

====================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆగస్టు 1వతేదీన భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించనున్నారు. ఆ తరువాత బహిరంగ సభనుద్దేశించి ప్రసంగించనున్నారు. రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, బీసీ.జనార్ధన్ రెడ్డి, కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యారాణి, పలువురు ప్రజాప్రతినిధులు సభ ఏర్పాట్లను విమానాశ్రయంలో ఈరోజు సమీక్షించారు. ఉదయం 10 గంటల 30 నిమిషాల నుంచి ప్రధానమంత్రి పర్యటన ప్రారంభమవుతుందని, విమానాశ్రయంలో 13 వేల మందితో అరకు థింసా గిరిజన నృత్యంతో ప్రధానమంత్రికి ఘనస్వాగతం పలుకనున్నామని వెల్లడించారు. ట్రాఫిక్ లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రులు ఈ సందర్భంగా సూచించారు. సమీక్ష అనంతరం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ...

(వాయిస్…20 సెకన్లు)

====================

భారత్, జింబాబ్వే జట్ల మధ్య ఆఖరి టీ-20 క్రికెట్ మ్యాచ్ జింబాబ్వేలోని హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరుగుతోంది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లకు 5 వికెట్లు నష్టపోయి 192 పరుగులు చేసింది. భారత ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ అత్యధికంగా 81 పరుగులు చేసి రాణించాడు. ఇప్పటికే తొలి రెండు మ్యాచ్ లలో భారత్ విజయం సాధించి సిరీస్ ను కైవసం చేసుకుంది.

====================

వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన నిన్నటి అల్పపీడనం ఈరోజు ఉదయం నాటికి వాయుగుండంగా మారి అదే ప్రాంతంలో కేంద్రీకృతమై ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది రాగల 24 గంటల్లో తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని పేర్కొంది. రేపు పారాదీప్-సాగర్ ద్వీపాల మధ్య తీరం దాటే అవకాశం ఉందని, తీరం దాటే సమయంలో ఉత్తరాంధ్ర తీరం వెంబడి గంటకు 55 నుండి 65 కి.మీ. వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని హెచ్చరించింది. వాయుగుండం ప్రభావంతో ఉత్తర కోస్తా ఆంధ్రలో రేపు అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇక దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్‌లోని కొన్నిప్రాంతాల్లో వేడి, ఉక్కపోతతో కూడిన అసౌకర్యకర వాతావరణం నెలకొనే అవకాశం ఉందని వెల్లడించారు. తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాయుగుండంతో సముద్రం అలజడిగా ఉంటుందని, బుధవారం వరకు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

====================

సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం గిరి ప్రదక్షిణ ఈ నెల 28 తేదీన ఉదయం 6 గంటలకు తొలిపావంచ వద్ద ప్రారంభమై అడవివరం, హనుమంతువాక, జోడుగుళ్ళు పాలెం, అప్పుఘర్, వెంకోజి పాలెం, హెచ్.బి. కాలనీ, సీతమ్మధార, మురళినగర్, మాధవధార, N.S.T.L Gate, లక్ష్మీ నగర్, ప్రహ్లాదపురం, పాత గోశాల సింహాచలం బస్టాండ్ మీదుగా తొలి పావంచకు తిరిగి చేరడంతో ముగియనుంది. మొత్తం 32 కిలో మీటర్ల మేర సాగే ఈ గిరి ప్రదక్షిణ మార్గంలో ట్రాఫిక్ ను మళ్లిస్తున్నామని నగర పోలీస్ కమిషనర్ కార్యాలయం ఈరోజు ఒక పత్రికా ప్రకటనలో తెలిపింది. విశాఖ నగరం నుండి ఇతర జిల్లాలకు వెళ్లే వాహనాలు అనగా.. RTC కాంప్లెక్స్, మద్దిలపాలెం నుండి విజయనగరం, శ్రీకాకుళం, కొత్తవలస, అరకు, పాడేరు వైపు వెళ్లే RTC బస్సులు, భారీ వాహనాలు, కాన్వెంట్ జంక్షన్ - పోర్ట్ రోడ్ - షీలానగర్ - కూర్మన్నపాలెం - దువ్వాడ రైల్వే స్టేషన్ - అనకాపల్లి - సబ్బవరం హైవే - పెందుర్తి - ఆనందపురం జాతీయ

రహదారి మీదుగా మళ్లించబడతాయని పేర్కొంది. అలాగే ఇతర జిల్లాల నుండి విశాఖ నగరంలోకి వచ్చే వాహనాలు అదే మార్గంలో ఆర్టీసీ కాంప్లెక్స్ చేరుకుంటాయని వెల్లడించింది.

=====================

=====================